క్లుప్తంగా

ఆర్థిక సాయం


రమాదేవి కుటుంబానికి నగదు అందజేస్తున్న సుబ్బరాయుడు

బనగానపల్లె : మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన ఈడిగ రమాదేవి ఈ నెల 22న పొలంలో పాముకాటుకు గురై మృతి చెందడంతో అదే గ్రామానికి చెందిన ఎర్రపాపనగారి సుబ్బారాయుడు రూ.70వేల ఆర్థిక సాయాన్ని మృతురాలి సోదరుడు హరిష్‌గౌడ్‌కు బుధవారం అందజేశారు. మృతురాలి భర్త శేఖర్‌గౌడ్ రెండేళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందడంతో వీరికి ఉన్న 8 సంవత్సరాల్లోపు ఇద్దరి కుమారులు అనాథలుగా మారడంతో మానవత దృక్పదంతో సాయం అందజేశారు. సంజీవగౌడ్ పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆశా కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. వేతనాల పెంపుతో పాటు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆశా కార్యకర్తల కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. రూ.26వేలు వేతనం ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్ల జిల్లా ట్రెజరర్ లక్ష్మీదేవి,ఆశా కార్యకర్తలు ప్రమీల,శోభ,రంగమ్మ,బయమ్మ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దు


పార్కును శుభ్రం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పర్యావరణానికి పెనుభూతంగా మారిన ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి స్వస్తి పలకాలని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ పట్టణవాసులకు సూచించారు. బుధవారం శేషారెడ్డి పార్కులో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆవరణాన్ని శుభ్రం చేసి, పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం బేతంచెర్ల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు మొక్కలు నాటి సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

మెరుగైన సేవలందించాలి


మాట్లాడుతున్న డోన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కమలాకర్‌రావు

బేతంచెర్ల: బాధ్యతగా విధులు నిర్వహించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని డోన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కమలాకర్‌రావు విద్యుత్ సిబ్బందికి సూచించారు. బుధవారం విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ ఏడీ మధుసూదన్‌రెడ్డి, రూరల్, టౌన్ విద్యుత్ ఏఈలు శ్రీనివాసులు, శివన్న ఆధ్వర్యంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, వినియోగదారులకు సమస్య తలెత్తినాసత్వరమే పరిష్కరించాలని సూచించారు.

కార్మికుల వేతనాలు పెంచాలి


డిప్యూటీ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్యాపిలి: పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, చిన్నరహిమాన్ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం వారు డిప్యూటీ ఎంపీడీఓ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రంగస్వామి, వివిధ సంఘాల నాయకులు ఇలియాజ్, నాగరాజు, రాము, మారెప్ప, కంబగిరి, ఈరమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పోలీసులకు సమాచారం ఇవ్వండి

డోన్ టౌన్: ప్రజల భద్రత, ఆస్తి రక్షణ అందరి సహకారంతోనే సాధ్యమవుతుందని, దసర పండుగ సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి ఇతర గ్రామాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారి ఇళ్లనే దొంగలు ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్నారన్నారు. పోలీసులకు ముందుగా సమాచారం ఇస్తే ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.

25, 26 తేదీల్లో ఆధార్ సేవలు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామ సచివాలయం, బేతంచెర్ల 4వ సచివాలయంలో ఈనెల 25, 26 తేదీలలో ప్రత్యేక ఆధార్ కేంద్రం ఉంటుందని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. విద్యార్థులు, చిన్నారుల ఆధార్ కార్డుల్లో ఏమైనా సమస్య ఉంటే సరిచేసుకోవాలన్నారు.

ఆయకట్టు.. వర్షధారంగా!

- నిరుపయోగంగా మారిన మద్దిలేటి స్వామి స్ప్రింగ్ చానల్
- శిథిలమైన పంట కాల్వలు
- మూడు నెలల క్రితం రూ.70లక్షలతో ప్రతిపాదనలు
- నేటికీ మంజూరు కాని నిధులు
- వర్షాధార పంటలను సాగు చేస్తున్న రైతులు

బనగానపల్లె: మండలంలోని మద్దిలేటిస్వామి తండా పరిసర ప్రాంతాల్లోని ఎత్తైన కొండ ప్రాంతాల నుంచి లభించే నీటికి అనుసంధానంగా ఉన్న మద్దిలేటిస్వామి స్ప్రింగ్ చానల్ సుమారు దశాబ్ద కాలంగా నిరుపయోగంగా మారింది. ఈ పథకం అభివృద్ధికి మూడు నెలలు క్రితం రూ.70 లక్షలతో పంపిన ప్రతిపాదనలకు ఇంత వరకు మోక్షం లభించలేదు. ఈ పథకం పరిధిలో చిన్న రాజుపాళెం తండాకు చెందిన ఆయకట్టుతో పాటు పరిసర గ్రామాలకు చెందిన మరిన్ని భూములు ఉన్నాయి. అధికారికంగా 100 ఎకరాల ఆయకట్టు ఉండగా అనధికారికంగా మరో 60 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇతర సాగునీటి ఆధారం లేని ఈ భూములకు ఈ పథకం ద్వారా లభించే నీటితో పంటలకు ఎంతో ఉపయోకరంగా ఉండేది. సుమారు 30 ఏళ్ల క్రితం ఈ పథకం ఏర్పాటు చేయగా 20 సంవత్సరాల పాటు ఏటా ఇబ్బంది లేకుండా సాగు నీరు అందింది. దీంతో నాడు ఆయకట్టు రైతులు మొక్కజొన్న, కంది తదితర పంటలను పండించారు. దశాబ్దకాలంగా ఈ పథకానికి ప్రభుత్వ ఆదరణ లభించక నిరుయోగంగా మారింది. ఫలితంగా ఆయకట్టు భూములు మెట్ట భూములుగా మారాయి. ఈ ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా పడక పంటలు ఆశాజనకంగా పండటం లేదని రైతులు వాపోతున్నారు. పథకం అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడంతో పథకంతో పాటు పంట కాల్వలు శిథిలావస్థకు చేరాయి.


నిరుయోగంగా మారిన ఎత్తిపోతల పథకం


శిథిలమైన పంట కాల్వలు

నాలుగు ఎకరాల ఆయకట్టు ఉంది



ఈ పథకం పరిధిలో మాకు నాలుగు ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. పథకం నుంచి నీరందిన సమయంలో మొక్కజొన్న, కంది పంటలు సాగు చేశాం. పంటలు కూడా బాగా పండేవి. అయితే పదేళ్లకు పైగా నీళ్లందడం లేదు. దీంతో వర్షాధారంగా పంటలు వేయాల్సి వస్తోంది. అయితే ఈ ప్రాంతంలో వర్షం సరిగా కురవక పంటలు పండటం గగనమైంది.

– ఈశ్వర్‌నాయక్, రైతు, చిన్నరాజుపాళెం తండా

వర్షధారంపై ఆధార పడుతున్నాం



కొంత కాలంగా పథకం పరిధిలో ఉన్న ఆయకట్టుకు సాగునీరు లభించక వర్షాధారంపై ఆదారపడ్డాం. ఆయకట్టులో మాకు ఐదెకరాల సాగుభూమి ఉంది. పథకాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేసి ఆయకట్టుకు సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలి.

– సుబ్బానాయక్, రైతు, చిన్నరాజుపాళెం తండా

ప్రతిపాదనలు పంపాం

మద్దిలేటిస్వామి స్ప్రింగ్ చానల్ అభివృద్ధికి మూడు నెలల క్రితం రూ.70లక్షలు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పథకం అభివృద్ధితో పాటు కాల్వలను అభివృద్ధి చేసి మరింత పాడింగించే పనులు చేపడతాం.

– రామ్మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఏఈ, బనగానపల్లె మైనర్ ఇరిగేషన్

అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు రిమాండ్

కోవెలకుంట్ల: పట్టణంలో గత నెలలో చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ తెలిపిన వివరాల మేరకు.. ఉయ్యాలవాడ మండలం తుడుమలదిన్నెకు చెందిన ఉప్పరి కృష్ణుడు ఆరుతులాల బంగారు ఆభరణాలను గత నెల 29న కోవెలకుంట్ల స్టేట్‌బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.2 లక్షల రుణం తీసుకున్నాడు. నగదు తీసుకుని బైక్ సైడ్ బ్యాగ్‌లో పెట్టుకుని స్వగ్రామానికి బయలు దేరాడు. నాగులకట్ట సమీపంలో ట్రాఫిక్‌లో చిక్కుకుని బైక్‌ను నిలుపాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు బైక్ సైడ్‌బ్యాగ్‌లోని నగదును అపహరించుకెళ్లారు. ట్రాఫిక్‌లో నుంచి బయటపడిన తరువాత బ్యాగ్‌లో నగదు లేకపోవడంతో కోవెలకుంట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దొంగలు చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఆ ముఠా వివిధ జిల్లాల్లో చోరీలకు పాల్పడినట్లు ఆయా జిల్లాల్లో కేసులు నమోదు కాగా అనంతపురం జిల్లా గోరంట్ల పోలీసులు ఐదుగురు మహిళలు, ఒక పురుషుడితో కూడిన దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. అదే ముఠా ఇక్కడి చోరీకి పాల్పడినట్లు తేలడంతో పోలీసులు ముఠాను కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరం ఒప్పుకోవడంతో వారి నుంచి రూ.1.20 లక్షల నగదు స్వాధీనం చేసుకుని ఆళ్లగడ్డ కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని సీఐ వివరించారు.

ఈ- పాస్ యంత్రాలపై శిక్షణ


డీలర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని రేషన్‌షాపు డీలర్లకు ఈ-పాస్ యంత్రాలపై శిక్షణ ఇచ్చారు. డీలర్లకు ప్రభుత్వం కొత్త ఈ-పాస్ యంత్రాలను పంపిణీ చేసింది. తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, సీఎస్‌డీటీ నాగేశ్వరరెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ సునీల్ యంత్రాలను వినియోగించే విధానంపై డీలర్లకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా పంపిణీలో అక్రమాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రతి నెలా 26వ తేదీ నుంచి నెలాఖరు వరకు దివ్యాంగులు, 65 సంవత్సరాలు పైబడి వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి నిత్యావసర సరుకులు అందజేయాలని చెప్పారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు చౌకదుకాణాల్లో ప్రజా పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. ఆర్‌ఐ లక్ష్మి, వీఆర్‌ఓలు, డీలర్లు పాల్గొన్నారు.

ఆత్మజ్ఞానమే మోక్షానికి మార్గం


ప్రసంగిస్తున్న వెంకటరెడ్డి

కోవెలకుంట్ల: ఆత్మజ్ఞానమే మోక్షానికి మార్గమని హిందూ ధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని భీమునిపాడు గ్రామంలో వెలసిన పద్మనాభస్వామి ఆశ్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం ఆధ్మాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్మాత్మిక కర్త నిత్య తృప్తిదాసు భగవద్గీత, రామాయణం, మహా భారతం గురించి భక్తులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. పరిషత్ సభ్యులు మనోహర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, భారతి, ప్రమీలమ్మ, భాగ్యలక్ష్మి, సత్యనారాయణమ్మ, వెంకట లక్ష్మమ్మ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి


ఆకుమల్లలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ డాక్టర్ కొండారెడ్డి

సంజామల: వర్షకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించి పశువులను కాపాడుకోవాలని పశుసవంర్థక శాఖ ఏడీ డాక్టర్ కొండారెడ్డి అన్నారు. మండలంలోని ఆకుమల్ల గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లడుతూ.. ప్రభుత్వం ఉచితంగా వ్యాధి నివారణ టీకాలు వేస్తుందన్నారు.సంజామల,కొలిమిగుండ్ల మండలంలో 17,480 గేదలు,ఆవులు,ఎద్దులు ఉండగా..ఇప్పటి వరుకు 5,697 పశువులకు టీకాలు వేశామని చెప్పారు. సంజామల మండల డాక్టర్ కృష్ణకృమార్,జెఈఓ వాసు,ఏహెచ్ఓ మహబూబ్ బేగ్ పాల్గొన్నారు.

పౌల్ట్రీ పరిశ్రమతో యువతకు ఉపాధి


ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత

బనగానపల్లె రూరల్ : పౌల్ట్రీ పరిశ్రమతో గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పౌల్ట్రీ,పౌల్ట్రీ ఉత్పత్తులపై ఒక్కరోజు వర్క్‌షాప్ జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రోటీన్ అవసరాలు పెరుగుతునందున పౌల్ట్రీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ రంగంలో శాస్త్రీయ అవగాహన పెంచుకోవడం వల్ల విద్యార్థులు పరిశోధనల్లోనూ, వ్యాపార రంగంలోను రాణించేందుకు అవకాశముంటుందన్నారు. విద్యార్థులు పౌల్ట్రీరంగంలో వినూత్న ప్రాజెక్టులు,నమూనాలు,పోస్టర్ల ప్రదర్శించారు. అధ్యాపకులు మహమ్మద్‌గౌస్, జె.వసుందరమ్మ, కౌసల్యాదేవి, ఫాతిమా, ఉమామహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

సేవా భావాన్ని పెంపొందించుకోవాలి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ప్యాపిలి: విద్యార్థులు సేవా భావాన్ని కలిగి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, కర్నూలు కేవీఆర్ డిగ్రీ కళాశాల లెక్చరర్ జయలక్ష్మి సూచించారు. స్థానిక కళాశాలలో జాతీయ సేవా సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది విద్యార్థులే అన్నారు. విద్యలో తమకంటూ ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలన్నారు. చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉంటే సమాజంలో జరుగుతున్న పలు విషయాలపై అవగాహన కలుగుతుందన్నారు. తద్వారా తోటి వారికి చేయాల్సిన సేవా కార్యక్రమాలను చేపట్టవచ్చన్నారు. చదువుకు ఆటంకం లేకుండా విద్యార్థులు సంఘసేవ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో హుసేనాపురం ఉపాధ్యాయుడు సర్వజ్ఞమూర్తి, సెక్రెడ్ ఏరియా కోఆర్డినేటర్ శివశంకర్, లెక్చరర్లు రామకృష్ణయ్య, ఓబులేసు, వెంకటరమణ, వెంకటేశ్, మద్దిలేటి పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సుకు రూ.3.73 లక్షల జరిమానా


వాహనాన్ని అదుపులోకి తీసుకున్న అధికారులు

డోన్ టౌన్: రోడ్ ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న ఓ ప్రైవేట్ బస్సుకు రూ.3.73 లక్షల జరిమానా విధించినట్లు డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. బుధవారం తెల్లవారు జామున కర్నూలు వైపు ఉన్న టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. బెంగళూరు నుంచి తెలంగాణలోని పాల్వంచకు వెళ్తున్న కల్పక ట్రావెల్స్ బస్సును తనిఖీ చేయగా రోడ్ ట్యాక్స్ చెల్లించని విషయం గుర్తించి జరిమానా విధించామన్నారు. ఈయన వెంట నంద్యాల అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రరావు ఉన్నారు.

మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

ప్యాపిలి: మహిళలు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని వైద్యాధికారులు రంగారెడ్డి, రాహుల్, హరిత అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారులు మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందన్నా రు. పీహెచ్‌సీలో మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. అనంతరం క్షయ వ్యాధి బాధితులకు పోషకాహారం కిట్లను అందజేశారు. డీపీఎంఓ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

కొలిమిగుండ్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మాణంలో ఉన్న పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ప్రజలకు వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.50 లక్షలు మంజూరు చేయడంతో భవనం పనులు ప్రారంభించారు. ఆ తర్వాత కాంట్రాక్టర్ పనులు నిలిపి వేయడంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్లాస్టింగ్, ఫ్లోరింగ్,విద్యుత్,పెయింటింగ్ తదితర చిన్న చిన్న పనులు మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది. 15 నెలల తర్వాత పునఃపనులు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల నుంచి ప్లాస్టింగ్ పనులు జరుగుతున్నాయి. భవనం అందుబాటులోకి వస్తే మండల ప్రజలు వైద్య పరీక్షలకు పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రూ.20 లక్షల విలువైన పరీక్షల పరికరాలను పీహెచ్‌సీలో అందుబాటులో ఉంచింది.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

సంజామల: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పీ–4 తీసుకొచ్చిందని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి రెండు రోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహించారు.బుధవారం ఆయన మాట్లడుతూ..పేదల జీవనోపాధిని మేరుగు పరచడానికి పీ–4 ద్వారా ఉపయోగ పడుతుందన్నారు. సచివాలయ సిబ్బంది ప్రభుత్వం నిర్దేంచిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఏఓ రామ సుబ్బయ్య,పంచాయితీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

మనోభావాలను దెబ్బతీయొద్దు


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బలిజ సంఘం నాయకులు

బనగానపల్లె రూరల్ : దొమ్మర కులం పేరును గిరి బలిజగా మారుస్తూ కూటమి ప్రభుత్వం జారి చేసిన జీవో వల్ల రాష్ట్రంలో కాపు బలిజల మనోభావాలు దెబ్బతింటున్నాయని మండల బలిజ సంఘం నాయకులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీ ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి ఎల్‌ఐసీ రోడ్డు, పోలీసు స్టేషన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. అలాగే ఫోర్‌లైన్ రోడ్డుపై ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఎదుట, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో పలువురు మండల బలిజ సంఘం నాయకులు మాట్లాడుతూ.. దొమ్మర కులస్తులను సంతృప్తి పరచడానికి ప్రభుత్వం వారి కులం పేరు మార్చడంలో తమకు ఎలాంటి అభ్యంతరంలేదని, అయితే బలిజ కులంతో ఎటువంటి సంబంధంలేని దొమ్మర కులాన్ని గిరి బలిజ అని పేర్కొనడం తమ మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. వెంటనే ఆ పదాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ నారాయణరెడ్డికి అందజేశారు. సంఘం మండల నాయకులు గొట్టిరవి, బండిగారివెంకటయ్య, శంకర్ రెడ్డి,నీలి శ్రీనివాసులు, నీలిరవి, కూరాకుల రామసుబ్బారెడ్డి,రాజశేఖర్,బ్యాంకు పుల్లయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి


ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

డోన్: ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు ముఖ్య అధికారిని లీలావతి సూచించారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొబైల్ వ్యాన్ ద్వారా పాతబస్టాండ్, గుత్తిరోడ్డు, శేగు సినిమా థియేటర్ తదితర ప్రాంతాల్లో ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధిగ్రస్తుల పట్ల చిన్నచూపు చూడరాదని నీలావతి కోరారు. ఎవరైనా ఎయిడ్స్ వ్యాధితో పాటు మాదకద్రవ్యాలకు అలవాటు పడితే 1097 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఉచితంగా మందులు పొందవచ్చని ఆర్‌డీఓ నరసింహులు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి షంషాద్‌బేగం, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


నందవరం గ్రామంలో చంద్రఘంట అలంకారములో చౌడేశ్వరిదేవి


బనగానపల్లెలో శ్రీ శారదేవి అలంకారములో వాసవీమాత



కోవెలకుంట్లలో అన్నపూర్ణదేవి అలంకారంలో వాసవీమాత, మారెమ్మ అమ్మవారు


నేలబెలుంలో అన్నపూర్ణ దేవిగా పార్వతీదేవి


అవుకులో కాత్యాయని దేవిగా వాసవీ మాత

లలితా దేవీ.. నమోస్తుతే!


అమ్మవారిశాలలో లలితాదేవిగా దర్శనం

దసరా శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాల్లో అమ్మవార్లు మూడోరోజు బుధవారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామునుంచే పూజార్లు అమ్మవార్లకు మేల్కొలుపు పూజలు నిర్వహించి పంచామృతాభిషేకం, కలశారాధన, కుంకుమార్చన, ఆకుపూజ, నైవేద్యం, హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేట అమ్మవారిశాలలో వాసవీ కన్యాకా పరమేశ్వరి లలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పండ్లతో అలంకరించి నెయ్యిలో అమ్మవారి ప్రతిమ ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. పాత బస్టాండ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద విజయవాడ కనకదుర్గమ్మ మాల దీక్షాపరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో, దుర్గమ్మ గుడిలోని అమ్మవారిని, కొత్తపేటలోని కనకదుర్గమ్మ గుడిలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.


దుర్గమ్మ గుడిలో లలితాదేవిగా అమ్మవారు


డోన్‌లో వివిధ రకాల పండ్లతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం


మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ..


బేతంచెర్లలో అన్నపూర్ణ దేవి అలంకరణలో ..


శ్రీనగర్ కాలనీలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మహాలక్ష్మీ అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో భక్తులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారు సహస్రదీపాలంకరణ సేవలో శోభాయమానంగా దర్శనమిచ్చారు. అలాగే బేతంచెర్ల అమ్మవారిశాలలో అన్నపూర్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గౌరిపేటలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించిన హనుమద్ వాహనంపై పురవీధుల గుండా ఊరేగింపు చేశారు.

ప్యాపిలి: స్థానిక మత్కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతను అన్నపూర్ణాదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇసికేల కంబగిరి స్వామి కుటుంబ సభ్యులు శాశ్వత పూజాదాతలుగా వ్యవహరించారు.


హనుమద్ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి


అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు